ఇంటి వద్దకే వైద్య సేవలు


కానూరులో దీర్ఘకాలిక రోగి ఇంటికి వెళ్లి వైద్యం అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ బృందం

- పేదల పాలిట వరంగా మారిన ఫ్యామిలీ ఫిజీషియన్
- దీర్ఘకాలిక రోగులకు అధిక ప్రయోజనం
- నియోజకవర్గంలో 27,505 మందికి సేవలు

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేద రోగులకు వరంలా మారింది. దీర్ఘకాలిక రోగులకు, ఆరోగ్య శ్రీలో శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షల కోసం గతంలో ఇబ్బందులు పడుతూ పట్టణాలకు వెళ్లేవారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమల్లోకి వచ్చిన తరువాత నిర్దేశిత సమయంలో రోగుల ఇళ్ల వద్దకే వైద్యులు వచ్చి వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందిస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 56 గ్రామాల్లో ఇప్పటి వరకు 261 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటంతో 27,505 మందికి వైద్య సేవలు పొందారు.

సుగర్, బీపీ రోగులకు భరోసా

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వయస్సుతో నిమిత్తం లేకుండా సుగర్, బీపీ వంటి రోగాలు పట్టిపీడిస్తున్నాయి. వీటి వల్ల రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజలు వీటికి వైద్యం చేయించుకోలేక, మందులు కొనుగోలు చేసుకోలేక ప్రాణాలు మీదకు తెచ్చుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం ప్రతి నెలా వైద్యులు ఇంటికే వచ్చి రక్తం, యూరిన్ పరీక్షలు చేయటంతో పాటు ఉచితంగా మందులు ఇవ్వడంతో పేదలకు ఆర్థిక భారం తగ్గి ఆరోగ్యంగా జీవిస్తున్నారు. ఇప్పటికే నిడదవోలు నియోజకవర్గంలో 9,250 మంది సుగర్, బీపీ రోగులకు సేవలు అందుతున్నాయి.

నిడదవోలు నియోజకవర్గంలో మండలాల వారీగా వైద్య సేవలు

మండలం	వైద్య శిబిరాలు	రోగులు
పెరవలి	63	5532
ఉండ్రాజవరం	64	5950
కానూరు	52	4767
నిడదవోలు	82	11256
	261	27,505

సీఎంకు ధన్యవాదాలు


ప్రతి నెలా వైద్య బృందం గ్రామాల్లోకి వచ్చి రక్త, యూరిన్ పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. అసలు రోగం ఉందనే భయం లేదు. ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం వల్ల మా ఆయుష్షు పెరిగింది. అందుకు ముఖ్యమంత్రికి జగన్ ధన్యవాదాలు.

– కొవ్వలి అచ్యుత రామయ్య, మునిపల్లి

మెరుగైన సేవలందిస్తున్నాం


గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. విలేజీ హెల్త్ క్లినిక్‌లకు వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు అందుబాటులో ఉన్నారు. ముఖ్యంగా సుగర్, బీపీ రోగులకు సేవలు అందించటమే కాకుండా గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం, ఆరోగ్య శ్రీ చికిత్సలు చేయించుకున్న రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం.

– పి. తేజశ్రీ, వైద్యురాలు పీహెచ్‌సీ, కానూరు

జీవితంపై ఆశ కలుగుతోంది


నాకు సుగర్ వ్యాధి ఉంది. ఇంట్లో ఆర్థిక ఇబ్బంది, పని మానుకుని నన్ను తణుకు ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చేంది. ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం వల్ల ఇంటి వద్దకే వైద్య సిబ్బంది వచ్చి పరీక్షలు చేసి, మందులు ఇస్తున్నారు. జీవితంపై ఆశ కలుగుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నా కృజ్ఞతలు.

– హనుమంతు జాన్సీ, కానూరు అగ్రహారం

వైఎస్సార్ సీపీ పాలనలోనే అన్ని వర్గాలకు మేలు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- కొవ్వూరులో పథకాలపై ఇంటింటా ప్రచారం


కొవ్వూరు ఐదో వార్డులో ప్రజలకు బ్రోచర్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి సక్రమంగా అందుతుందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. పట్టణంలో ఐదో వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్ పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజినీదేవి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ మద్దిపట్ల సాయి గీత, కంఠమణి రమేష్‌బాబు, బత్తి నాగరాజు, పతివాడ రామారావు, పిక్కి శ్రీనివాస్, గంగాధరనాగేశ్వర రావు, బావన రాజేష్, బోడపాటి హనుమంతరావు, సూర్ల నగేష్, చిట్టూరి అన్నవరం, వీర్ల శ్రీహరి పద్మ, మద్దిపట్ల దొరబాబు, మాసా ఆనంద్, గుర్రే శరత్, వేము వెంకటరత్నం, ఎండీ ఆలీ, బోడసింగి తులసీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

చాగల్లు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చెద్దామని కొవ్వూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీ కృష్ణదేవ రాయ కల్యాణ మండపంలో మంగళవారం పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించారన్నారు. వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరూ ప్రజల వద్దకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ప్రతి కుటుంబం పొందిన ఆర్థిక ప్రయోజనాలను వారికి తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, సొసైటీ అధ్యక్షుడు సుంకర రాయుడు, గూడపాటి శివ, సర్పంచులు మద్దుకూరి రవి, ముప్పిడి మహాలక్ష్ముడు, కుడప రాంబాబు, మట్టా వెంకట్రావు, కార్పొరేషన్ డైరెక్టర్లు సంసాని రమేష్, వి. రాఘురామ్, పి.సింహాద్రి పాల్గొన్నారు.

25న కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

రూ. 2 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణం


దేవరపల్లి మండలం యర్నగూడెంలో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం

దేవరపల్లి: దేవరపల్లి మండలం యర్నగూడెంలో నిడదవోలు ప్రధాన రహదారిని ఆనుకుని నిర్మించిన అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం పూర్తికావడంతో స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ సోమవారం వరకు ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 25న ఉదయం 8.21 గంటలకు దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. గతేడాది ఫిబ్రవరి 21న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఆలయ నిర్మాణం చేయగా, దీనిలో 99 శాతం నిధులు శ్రీకాకొళపు కాశీవిశ్వనాథం, రోహిణి దంపతులు విరాళంగా అందజేసి గ్రామస్తుల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. స్వామి వారి, అమ్మవార్ల విగ్రహాలతో పాటు గరుత్మంతుడు, ద్వారపాలకుల విగ్రహాలను కాంచీపురం నుంచి తీసుకువచ్చారు. రూ.10 లక్షల వ్యయంతో ధ్వజ స్తంభం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంగణంలో కోదండరాముడి ఆలయాన్ని నిర్మించారు. స్వామి, అమ్మవార్ల విగ్రహ శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేకం టీటీడీ ప్రధాన అర్చకులు అర్చకం వేణుగోపాల దీక్షితుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి అన్నసమారాధన, సాయంత్రం 6 గంటల నుంచి శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

ఆరోగ్య సురక్షతో గ్రామీణులకు మేలు


కాకరపర్రులో సురక్ష వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు



తాడిపర్రులో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

పెరవలి: ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఎంతో మేలు కలుగుతోందని, దీనికి సహకరిస్తున్న వైద్య సిబ్బందిని అభినందిస్తున్నామని జిల్లా వైద్య.ఆరోగ్యశాఖాధికారి టి.వెంకటేశ్వరరావు తెలిపారు. పెరవలి మండలం కాకరపర్రులో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ఆయన విచ్చేసారు. ఈ సందర్భగా ఆయన రోగులతో మాట్లాడారు. వైద్యులు రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా 514 మందిని పరీక్షించారు. బీపీ, సుగర్, సాధారణ వైద్య సేవలందించినట్టు కానూరు పీహెచ్‌సీ వైద్యురాలు పి.తేజశ్రీ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రాజమండ్రి జీఎస్‌ఎల్ నుంచి జనరల్ వైద్యనిపుణులు జి.తేజ్‌కిరణ్, వైద్యులు హేమరాజు, వైద్య సిబ్బంది బి.విజయలక్ష్మి, చిన్నారి, వి.రాజశేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

తాడిపర్రులో ఆరోగ్య సురక్ష శిబిరం

ఉండ్రాజవరం: తాడిపర్రు సచివాలయం వద్ద మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు సందర్శించి, వైద్య సేవలను పరిశీలించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్య శ్రీ సేవల కోసం నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపాలన్నారు. ఈ శిబిరంలో ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషాదేవి, డాక్టర్ వర్మ (చిన్నపిల్లల వైద్య నిపుణులు), డాక్టర్ నజీర్ (నేత్ర వైద్య నిపుణులు) పాల్గొని సుమారు 181 మందిని పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్, సీహెచ్‌వో ఎం.సుబ్రమణ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు జె.శ్రీనివాసరావు, నాగమణి, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధమవుతున్న క్వారీ లారీ కార్మికులు


దేవరపల్లి మండలం దుద్దుకూరులో సమావేశమైన క్వారీ లారీ కార్మికులు

దేవరపల్లి: క్వారీ లారీలపై పనిచేస్తున్న కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 23 నుంచి సమ్మెకు వెళుతున్నట్టు కార్మికులు ప్రకటించారు. వేతన ఒప్పందంపై లారీ యజమానులు, కార్మికుల మధ్య మంగళవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. క్వారీ లారీలపై పనిచేస్తున్న కార్మికులకు ప్రతి మూడేళ్లకు ఒకసారి యజమానులు వేతన ఒప్పందం చేస్తారు. గత ఒప్పంద కాలపరిమితి ఈ నెల 9వ తేదీతో ముగియడంతో నూతన వేతన ఒప్పందం చేయాలని గత నెల 23న యజమానులకు నోటీస్ అందజేశారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై రూ. 8 వేలు అదనంగా ఇవ్వాలని కార్మికులు ప్రతిపాదించారు. మరొక ఏడాది వరకు వేతనాలు పెంచలేమని యజమానులు చెప్పారు. దీంతో కార్మికులు సమావేశమై సమ్మె చేయడానికి నిర్ణయించినట్టు ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మస్తాన్ తెలిపారు. క్వారీల్లోని లారీలపై సుమారు 1,200 మంది కార్మికులు పనిచేస్తున్నట్టు మస్తాన్ తెలిపారు. వేతన ఒప్పందం జరిగే వరకు లారీలను కదలనీయమని ఆయన తెలిపారు. కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకుడు మెరుపు జాన్‌రాజ్, కార్మిక సంఘం నాయకులు ఆకాష్ బాజీ, సత్యనారాయణ, ఏడుకొండలు, ప్రసాదరావు, పోసియ్య, ఎం. రామకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో బూత్ కమిటీలే కీలకం


గోపాలపురం మండలం చిట్యాలలో బూత్ కమిటీ సభ్యులతో ఎంపీపీ వుండవల్లి, సురేష్

గోపాలపురం: గ్రామస్థాయిలో బూత్ కమిటీలే కీలకమని ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని గోపాలపురం ఎంపీపీ వుండవల్లి సత్యనాయణ అన్నారు. మండలంలోని చిట్యాలలో మంగళవారం బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి బూత్‌లోనూ కమిటీ సభ్యులు అవగాహనతో ఉండాలన్నారు. నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ ఆచంట సురేష్, నాయకులు వెలగా శ్రీరామమూర్తి, ముచ్చికర్ల రవి, మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, గద్దే సత్యనారాయణ, పెనుగొండ బాలాజీ, సాలి వేణు,పఠాన్ అన్సర్‌బాషా, మాజీ సర్పంచ్ ముచ్చికర్ల వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రశాంతంగా రెండో రోజు 'పది' పరీక్షలు

దేవరపల్లి: పదో తరగతి పరీక్షలు రెండవ రోజు మంగళవారం ప్రశాంతంగా కొనసాగాయి. హిందీ పరీక్షకు దేవరపల్లి మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 74 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవోలు ఎం.తిరుమలదాస్, కేఆర్‌ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 48 మంది కాగా, 27 మంది సప్లిమెంటరీ విద్యార్థులున్నారని తిరుమల దాస్ తెలిపారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో 969 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 921 మంది హాజరైనట్టు ఆయన తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 932 మందికి 910 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 37 మందికి 11 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్టు ఆయన చెప్పారు.

131 మంది విద్యార్థుల గైర్హాజరు

నల్లజర్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రెండో రోజు హిందీ పరీక్షకు 131 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు.1,168 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1,037మంది హాజరైనట్టు చెప్పారు.

పదో తరగతి పరీక్షకు 646 మంది హాజరు

తాళ్లపూడి: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పదోతరగతి పరీక్షలకు మొత్తం 714 మంది విద్యార్థులకు 646 మంది హాజరైనట్టు ఎంఈవో సీహెచ్ బాలామణి తెలిపారు. 72 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు.

శాస్త్రీయ విధానంలో సాగు ద్వారా అధిక దిగుబడి

కొవ్వూరు: శాస్త్రీయ విధానాలతో సాగు పద్ధతులు అవలంభిస్తే దాళ్వాలో అధిక దిగుబడి సాధించవచ్చని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు రైతులకు సూచించారు. మంగళవారం కొవ్వూరు, నందమూరు, తాళ్లపూడి, గజ్జరం, ప్రక్కిలంక గ్రామాల్లో ప్రస్తుతం దాళ్వా పంటలైన వరి, మొక్కజొన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వెంకట నరసింహారావు మాట్లాడుతూ దాళ్వాలో వరి పంటల చాలా ఆరోగ్యకరంగా, ఆశాజనకంగా ఉందన్నారు. ఏడీఏ కె.చంద్రశేఖర్, ఏవో ఏ.గంగాధర్, ఎంపీఈవో ఏ.నవీన్, సురేష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన


తాళ్లపూడిలో మొక్కజొన్న పంటను పరిశీలించి సూచనలు అందజేస్తున్న అధికారులు

తాళ్లపూడి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటుగా శాస్త్రవేత్తల సూచనలు పాటించి సాగు చేస్తే దాళ్వా వరి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం కోర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపూడి, ప్రక్కిలంక, గజ్జరంలో మంగళవారం ఆయన పర్యటించి వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కొవ్వూరు వ్యవసాయ శాఖ ఏడీఏ చంద్రశేఖర్, డాక్టర్ చల్లా వెంకట నరసింహారావుతో కలిసి క్షేత్ర సందర్శన చేసి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాళ్వా వరి పంటలో అక్కడక్కడ కాగిత పురుగు మాత్రమే గుర్తించామన్నారు.దీని నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ లీటర్ నీటికి 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. నానో యూరియా వినియోగంపై మార్టేరులో పరిశోధనలు కొనసాగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి రుచిత, కొవ్వూరు ఏవో గంగాధర్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నిడదవోలు రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూలీలంతా వినియోగించుకుని లబ్ధి పొందాలని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం, గోపవరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ నిబంధనల మేరకు పనులు చేసి రూ.272 వరకు వేతనం పొందవచ్చన్నారు. అనంతరం ఉపాధి కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధి పనుల ప్రాంతాన్ని, రికార్డులను తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ


విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న రొటేరియన్లు

నిడదవోలు: పట్టణంలోని రాయిపేట శ్రీరామా ప్రైవేట్ స్కూల్లో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 52 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. రొటేరియన్ ఉజ్జిన జవహర్‌లాల్ నెహ్రూ ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, గుంటుపల్లి శివకుమార్, చిక్కాల రాజా, కొత్తపల్లి నాగేశ్వరరావు, గొన్నబత్తుల రామారావు, కాళ్ల రాంబాబు, పొన్నా సుబ్రహ్మణ్యం, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల రామచంద్రరావు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

నల్లజర్ల: వైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై సీఎస్ఈ రెండు, మూడవ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం నుంచి 5 రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టరు అరవిందకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన సుప్రజ టెక్నాలజీస్ ప్రతినిధులు సిద్ధూ, మాధురి, సాయి కుమార్ రిసోర్సు పర్సన్లుగా వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఆకులత్రిమూర్తి, ప్లేస్‌మెంట్ అధికారి ఏఎస్ ప్రసాద్, సీఎస్ఈ అధిపతి పి.షీలా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలి


సమిశ్రగూడెంలో ఎస్సై రమేష్, పోలీసులు, కేంద్ర సాయుధ బలగాల కవాతు

నిడదవోలు రూరల్: ప్రజలకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవడానికి నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు రావాలని ఎస్సై ఎస్ఎస్‌వీవీ రమేష్ సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు మంగళవారం నిడదవోలు మండలంలోని సమిశ్రగూడెం, శెట్టిపేటలో పోలీసు కవాతు నిర్వహించారు. ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు కేంద్ర సాయుధ బలగాలతో మార్చ్‌ఫాస్ట్ చేశారు. ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై పరమహంస, పోలీసులు, పారామిలటరీ బలగాలు పాల్గొన్నారు.

5కే రన్‌లో రవికి రెండవ స్థానం

నిడదవోలు: విశాఖ ఆర్‌కే బీచ్ రోడ్డులో ఆదివారం నిర్వహించిన భారత్ నివేష్ మారథాన్ 5కే రన్ అండర్ -17 పోటీల్లో స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి ఎం. రవి రెండవ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె. జ్యోతి తెలిపారు. గతంలో రవి మీరట్‌లో నిర్వహించిన కళాశాల స్థాయి విశ్వవిద్యాలయ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. క్రీడల్లో రవిని ప్రోత్సహిస్తూ ప్రిన్సిపల్ మంగళవారం బాక్సింగ్ గ్లౌస్‌ను అందజేశారు.

వైఎస్సార్ సీపీలో చేరిక


ముద్రగడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్త బాబ్జి

తాళ్లపూడి: తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో మంగళవారం కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకులు ముద్రగడ పద్మనాభం సమక్షంలో రావూరుపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కోలిశెట్టి పరమేశ్వరరావు (బాబ్జి) వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ముద్రగడ వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దేవంకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరినట్టు బాబ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, తాళ్లపూడి మండలం కాపు సంఘం అధ్యక్షుడు నామ ప్రకాశం, కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వనిమిరెడ్డి శీను, ప్రక్కిలంక ఉప సర్పంచ్ విత్తం నాని, వైఎస్సార్ సీపీ నాయకులు చాముకూరి సత్యనారాయణ, చిలీ ప్రసాద్, ఇంటి నాగేశ్వరావు ఉన్నారు.

నేడు కాపవరంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పర్యటన

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి కాపవరంలో పర్యటిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

22న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కొవ్వూరు: ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు కొవ్వూరు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వీరభద్రరావు తెలిపారు. విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో పరిష్కార కోర్టు నిర్వహించి వినియోగదారుల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపిస్తారన్నారు.

జిల్లా కోర్టు పీపీగా గోపాలకృష్ణ


కొవ్వూరు: జిల్లా తొమ్మిదో అదనపు కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పట్టణానికి చెందిన కోమటి గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు గోపాలకృష్ణను కలిసి అభినందనలు తెలిపారు.

250 మందికి వైద్య సేవలు


దేవరపల్లిలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

దేవరపల్లి: స్థానిక గ్రామ సచివాలయం-3 వద్ద మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరంలో వైద్యాధికారులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు తెలిపారు. ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్యనిపుణులు కె. శ్రీనివాసవర్మ, శ్రీహర్ష శిబిరానికి హాజరై రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.